క్లుప్తంగా

పోలీసు శాఖ ఆధ్వర్యంలో సురక్షా దినోత్సవం



కొండమల్లేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, ప్రజలు

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలో ఆదివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో సురక్షా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ప్రజాప్రతినిధులు, ప్రజలతో కలిసి పోలీసులు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, కొండమల్లేపల్లి, గుడిపల్లి ఎస్‌ఐలు వీరబాబు, రంజిత్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, నాయకులు యుగేంధర్‌రెడ్డి, బూడిద మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

సబ్సిడీపై యంత్ర పరికరాలు ఇవ్వాలని వినతి



విజయసింహారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఏకే ఫౌండేషన్ చైర్మన్ అనిల్‌కుమార్

హాలియా: నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని రైతులకు సబ్సిడీపై ఆధునిక యంత్ర పరికరాలను అందించాలని ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మిర్యాలగూడలో టీఎస్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. సాగర్ నియోజకవర్గంలో ప్రతి ఏటా 10 లక్షల ఎకరాల్లో సేద్యం జరుగుతుందని, రైతులు సాంప్రదాయ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం వల్ల కూలీల కొరత, సమయాభావం, అధిక పెట్టుబడులతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సబ్సిడీపై ఆధునిక యంత్ర పరికరాలను అందిస్తే రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. దీనిపై తిప్పన విజయసింహారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు అనిల్‌కుమార్ తెలిపారు.

విద్యుత్ విజయోత్సవాలను జయప్రదం చేయాలి

మిర్యాలగూడ అర్బన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని శ్రీమన్నారాయణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న విద్యుత్ విజయోత్సవాలను జయప్రదం చేయాలని ట్రాన్స్‌కో డీఈ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మిర్యాలగూడ నియోజకవర్గంలోని అడవిదేవులపల్లి, దామరచర్ల, వేములపల్లి, మాడుగులపల్లి మండలాలతో పాటు మిర్యాలగూడ రూరల్, మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఉదయం 10 గంటలకు నిర్వహించబోయే విద్యుత్ విజయోత్సవాలలో ప్రజాప్రతినిధులు, విద్యుత్ వినియోగదారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

క్రీడా దుస్తులు అందజేత



త్రిపురారం: అల్వాలపహాడ్‌లో యువతకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న రవి

త్రిపురారం: మండలంలోని అల్వాలపహాడ్ గ్రామ యువతకు ఆదివారం గ్రామానికి చెందిన గుడిపాటి రవి స్పోర్ట్స్ టీషర్ట్‌లను అందజేశారు. కార్యక్రమంలో సందీప్, ఆకాశ్, కళ్యాణ్, రామలింగం, సాయి, సైదా, అంజి, రాంబాబు, సంతోష్, కోటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరులో..

నిడమనూరు: నిడమనూరు మాజీ సర్పంచ్ మేరెడ్డి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య, ప్రస్తుత సర్పంచ్ మేరెడ్డి పుష్పలత మండల కేంద్రంలో ఆదివారం కబడ్డీ క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అమెరికాలో ఉంటున్న తమ మనమడు మేరెడ్డి వెంకటరెడ్డి ఆర్థిక సహకారంతో క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసినట్లు మేరెడ్డి పుష్పలత తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు కల్లు పురుషోత్తంరెడ్డి, అలుగుబెల్లి వెంకటరెడ్డి, రవీందర్‌రెడ్డి, క్రీడాకారుడు చిలుముల విష్ణు, దిలీప్, పండు, హబీబ్, సంపత్, గైక్వాడ పవన్, చింటూ, గణేష్, నౌషద్ తదితరులు పాల్గొన్నారు.



నిడమనూరు: క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మేరెడ్డి పుష్పలత

నీటి కాల్వలపై నిర్లక్ష్యమేల

- పూడికలతో ఆనవాళ్లు కోల్పోతున్న ఏఎమ్మార్పీ కాల్వలు
- ఈ వేసవిలో మరమ్మతులు లేనట్లే
- చేసిన పనులకు బిల్లులు లేవు, కొత్తవి మంజూరు కావు



వెంకటాపురం గ్రామంలో పూడుకుపోయిన డి-24 కాల్వ



కొప్పోలు పరిధిలో కంపచెట్లతో నిండిన డి-23 కాల్వ

గుర్రంపోడు: ఈ వానాకాలంలో నెల రోజుల ముందుగానే సాగు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం సూచిస్తోంది. కాగా ప్రతి ఏటా వేసవిలో వరద కాల్వలకు చేపట్టాల్సిన మరమ్మతులను ఈసారి నిధుల లేమితో పట్టించుకోకపోవడంతో ఏఎమ్మార్పీ కాల్వలు కంపచెట్లు, పూడికలతో నిండి అస్తవ్యస్తంగా మారాయి. అక్కంపల్లి రిజర్వాయర్ నుంచి మూసీ వరకు 130 కిలోమీటర్ల ప్రధాన కాల్వ గట్లు కోతకు గురయ్యాయి. గుర్రంపోడు మండల పరిధిలోనే 25 కిలోమీటర్ల ప్రధాన కాల్వ ఉంది. ప్రధాన కాల్వ వెంబడి ఐదేళ్ల క్రితం కంపచెట్లు తొలగించినా మళ్లీ మరమ్మతులు చేపట్టలేదు. ప్రధాన కాల్వకు కాంక్రీట్ లైనింగ్ ప్రతిపాదన గత దశాబ్దకాలంగా ముందుకు సాగడం లేదు. గతంలో లైనింగ్‌కు పరిపాలనా అనుమతులు ఉన్నా నిధులు మంజూరు కాలేదు.

అస్తవ్యస్తంగా కాల్వలు

మండలంలో డి-16 నుంచి డి-25 వరకు గల డిస్ట్రిబ్యూటరీల కాల్వలు చివరకు నీరు చేరే అవకాశం లేకుండా ఉన్నాయి. ఏఎమ్మార్పీ ప్రాజెక్టు పనుల్లో మొదటగా తవ్విన డి-23, డి-24 కాల్వలు పూర్తిగా దెబ్బతినగా వీటికి ఇరవై ఏళ్లుగా మరమ్మతులు లేవు. డి-19, డి-22, డి-25ల నిర్మాణాలకు సంబంధించి ప్యాకేజీ కాంట్రాక్టరే మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా అక్కడక్కడా అసంపూర్తి పనులు, పంట కాల్వలు తవ్వకుండానే పనులు ముగించాడు. దీంతో కాల్వల్లో పూడికలు నిండి చివరి పొలాలకు నీరు చేరని పరిస్థితి నెలకొంది. గతంలో ఖరీఫ్‌కు ముందు ప్రతి ఏటా మరమ్మతులు చేసేవారు. కానీ మూడేళ్లుగా నిధులు లేవంటూ పట్టించుకోవడం లేదు. డివిజన్ పరిధిలో గతంలో చేపట్టిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు సుమారు రూ.50లక్షల మేర బిల్లులు రావాల్సి ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో అవసరమైన చోట్ల తక్షణ మరమ్మతులకు కాంట్రర్లు ముందుకు రావడం లేదు.

పూడుకుపోయిన కాల్వలు

మండలంలో డి-20, 21, 19, 25లలోని గుర్రంపోడు, చేపూరు, కొప్పోలు గ్రామాల పరిధిల్లో నల్లరేగడి భూముల్లో కాల్వలు పూడిపోయాయి. నీరు వదిలే ప్రతిసారి రైతులు కాల్వల్లో పూడిక తీయించుకోవాల్సి వస్తుంది. నల్లరేగడి కాల్వల్లో కాంక్రీట్ లైనింగ్ చేయాల్సి ఉండగా పల్లిపహాడ్, తేరాటిగూడెం పరిధిల్లో మాత్రమే లైనింగ్ జరిగింది. మండలంలోని డి-25 కాల్వ 16 కిలోమీటర్ల పొడవున ఉండి అక్కడక్కడ దెబ్బతిన్న కాల్వ గట్లతో చివరకు నీరందని పరిస్థితి ఉంది. 18 కిలోమీటర్ల పొడవు గల డి-22 పరిధిలోని కాల్వ మొసంగి, కొత్తలాపురం పరిధిల్లో కంపచెట్లతో మూసుకునిపోయి నీరు పారడం లేదు.

కంపచెట్లతో మూసుకుపోయిన రహదారులు..

ఏఎమ్మార్పీ మేజర్, మైనర్ కాల్వల వెంబడి గల రోడ్లు కంపచెట్లతో మూసుకుపోయాయి. ప్రధాన కాల్వపై రెండేళ్ల క్రితం కంపచెట్లు తొలగించిన అధికారులు మేజర్లు, మైనర్లను మాత్రం నిధులు లేని కారణంగా పట్టించుకోలేదు. నిధుల లేమి, సిబ్బంది కొరతతో కాల్వల పర్యవేక్షణను అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



ఏఎమ్మార్పీ పరిధిలోని కాల్వల్లో సగానికి కూడా నీరు చేరడం లేదు. నీరు పంటపొలాలకు చేరాలంటే కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి. కాల్వల్లోని కంపచెట్లు, పూడికలు తొలగించాలి. నల్లరేగడి నేలల్లో లైనింగ్‌లు చేపట్టాలి. మొట్టమొదటగా తవ్విన డి-23, డి-24 కాల్వల మరమ్మతులు తక్షణమే చేపట్టాలి. – రేపాక లక్ష్మీపతి, రైతు సంఘం నాయకుడు, గుర్రంపోడు

ప్రతిపాదనలు పంపాం



కాల్వల్లో కంపచెట్లు, పూడికల తొలగింపునకు శాఖాపరంగా నిధుల మంజూరు లేదు. ఉపాధిహామీ పథకం ద్వారా గతంలో కంపచెట్లు తొలగించినప్పటికీ ప్రస్తుతం కంపచెట్ల తొలగింపు ఉపాధి హామీలో పరిమితంగానే చేపడుతున్నారు. అత్యవసరమైన పనులకు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతున్నాం. – ఆనందరావు, డివిజన్ ఈఈ



ఎడ్లకు పూజలు చేసి వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతు

ఏరువాక సంబురం

హాలియా: ఏరువాక పౌర్ణమి పండుగ సందర్భంగా ఆదివారం అనుముల మండలంలో రైతులు తమ వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఏటా జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమ నాడు వచ్చే ఈ పండుగను అన్నదాతలు ఎంతో వైభవంగా జరుపుకుంటారు. ఏరువాక పౌర్ణమి పండుగ సందర్భంగా మండలంలోని రైతులు తమ కాడెద్దులను కడిగి వాటి కొమ్ములకు రంగులు పూసి మెడలో గజ్జెలు కట్టి గంటలతో అలంకరించారు. ఎడ్లకు కట్టె కాడిని దూపదీప నైవేద్యాలతో రైతులు పూజించారు. అనంతరం వ్యవసాయ పొలాలకు వెళ్లిన రైతులు భూతల్లికి పూజలు నిర్వహించి తమ ఎద్దులతో దుక్కి దున్నడం ప్రారంభించారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి



హజారిగూడెం మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న జానారెడ్డి తదితరులు

హాలియా: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. ఆదివారం హాలియా మండలంలోని హజారిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిఒక్కరూ ఆధ్మాతికతను అలవర్చుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అదే విధంగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గుంటక నారాయణరెడ్డిని జానారెడ్డి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్ యాదవ్, నాయకులు రిక్కల సుధాకర్‌రెడ్డి, నాగిరెడ్డి, కుంటిగొర్ల శ్రీనివాస్‌యాదవ్, బుగ్గయ్య యాదవ్, సంద్రాల వెంకటేశ్వర్లుయాదవ్, కుంటిగొర్ల పాపయ్యయాదవ్, మన్యం కృష్ణమూర్తి, సర్పంచ్ వద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాదెండ్ల శ్రీనివాస్‌రెడ్డి, మట్టారెడ్డి, డాక్టర్ వెంకట్‌రెడ్డి, ఓబుల్‌నేని రామకృష్ణ, బుచ్చిబాబు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

వేములపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2001-02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. 22 ఏళ్ల తర్వాత స్నేహితులంతా ఒక్కచోట చేరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను, ఉపాధ్యాయులతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువా, మెమొంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉష, సంపూర్ణ, ఉమామహేశ్వరి, సునీత, ఊర్మిళ, స్వప్న, ఆయేషా, రామ్మూర్తి, గంగయ్య, వెంకన్న, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేష్, అనిల్‌రెడ్డి, అనిల్, నరేష్, సురేష్, సతీష్, సంతోష్, ఎన్. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులు గోస పడుతుంటే దశాబ్ది సంబరాలా..

- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి



మాట్లాడుతున్న కిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు గోస పడుతుంటే 22 రోజుల పాటు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సంబరాలు నిర్వహించడం సిగ్గుచేటని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని హౌజింగ్ బోర్డులో గల బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కిసాన్ మోర్చా పట్టణ శాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ముఖ్యమంత్రి కేసీఆర్ తుంగలో తొక్కారని ఆరోపించారు. కేసీఆర్ మరోసారి తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తా అని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని, రైతు రుణమాఫీ చేస్తామని చెప్పిన కేసీఆర్ నేటికీ ఒక్కటి కూడా నెరవేర్చలేదని అన్నారు. ధాన్యం తడిసిన రైతులకు నష్టపరిహాన్ని చెల్లించాలని, కొనుగోలు కేంద్రాలల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని తక్షణమే తరలించాలని డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు బి. అంతయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ జిల్లా నాయకుడు అమిరెడ్డి రామచంద్రారెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొండపాటి వెంకట్‌రెడ్డి, కిసాన్ మోర్చా నాయకులు వినయ్, జాను నాయక్, పి. శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

కిటకిటలాడిన పశువుల సంత



క్రయ విక్రయదారులతో సందడిగా పశువుల సంత



పొట్టేళ్ల విక్రయాలు జరుపుతున్న వ్యాపారులు

కొండమల్లేపల్లి: నల్లగొండ జిల్లాలోనే అతిపెద్దదైన కొండమల్లేపల్లి పశువుల సంత ఆదివారం క్రయ విక్రయాలతో కిటకిటలాడింది. వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతుండడంతో సంతలో పెద్ద మొత్తంలో పశువుల క్రయ విక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది. దీనికి తోడు ఈ నెలలోనే బక్రీద్ పండుగ ఉండడంతో పెద్ద సంఖ్యలో గొర్రె పొట్టేళ్ల విక్రయాలు జరిగాయి.

సబ్సిడీపై పాడి గేదెలను అందించాలి

చిట్యాల: గొల్ల, కురుమలకు గొర్రెలతోపాటు సబ్సిడీపై పాడి గేదెలను అందించాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాలలోని పీఆర్‌పీఎస్ కార్యాలయంలో ఆదివారం జరిగిన యాదవ కులస్తుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండో విడత గొర్రెల పంపిణీ వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. మెడబోయిన లింగయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మోటె కృష్ణయ్య యాదవ్, చొప్పరి నర్సింహ, మెండె గోపాల్, పోషబోయిన అయిలయ్య, మోటె మల్లయ్య పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఖరారు

- ఏడాదిన్నర తర్వాత అవంతీపురం మార్కెట్ కమిటీ ఏర్పాటుకు మోక్షం
- దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన ఎస్సీ సామాజికవర్గ వ్యక్తికి చైర్మన్ పదవి



అవంతీపురం వ్యవసాయ మార్కెట్

మిర్యాలగూడ: మండల పరిధిలోని అవంతీపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీకాలం ముగిసి ఏడాదిన్నర అయ్యింది. అప్పటి నుంచి ఆశావహులు ఎదురుచూస్తుండగా, ఎట్టకేలకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామంలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఖరారైనట్లు తెలుస్తోంది. అతని నియామకానికి దామరచర్ల మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు చక్రం తిప్పినట్లు సమాచారం. వైస్ చైర్మన్ పదవిని దామరచర్ల మండల కేంద్రంలోని ఓసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి కేటాయించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా అడవిదేవులపల్లి, వీర్లపాలెం గ్రామాల నుంచి రెండు డైరెక్టర్ల పదవులు ఖరారు కాగా, మిగతా మండలాలైన మాడుగులపల్లి, వేములపల్లి, మిర్యాలగూడ నుంచి డైరెక్టర్లను త్వరలో ఎన్నుకోనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇప్పటికే చైర్మన్ నియామకపత్రంపై సంతకం కూడా జరిగి ఎమ్మెల్యే వద్దకు చేరిందని, మరో వారం రోజుల్లో నిమాయకపత్రాన్ని అందచేయనున్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే అవంతీపురం వ్యవసాయ మార్కెట్ కమిటీకి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ మార్కెట్ కమిటీ పరిధిలో సాగర్ ఆయకట్టు ప్రాంతం ఉండడంతో పాటు ఆసియా ఖండంలోనే అత్యధిక రైస్‌మిల్లులు ఉన్న ప్రాంతం కావడంతో ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా అవంతీపురం మార్కెట్ కమిటీ తొలి కార్యవర్గంలో చైర్మన్ పదవి రిజర్వేషన్ గిరిజనులకు కేటాయించగా పాలకవర్గం నియామకంలో కాలయాపన జరగడంతో చిట్టిబాబ నాయక్ చైర్మన్‌గా సంవత్సరం పాటు వ్యవహరించారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ రిజర్వేషన్ ఓసీ(జనరల్) కావడంతో చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి 2021 ఆగస్టు నెలలో తన పదవీకాలాన్ని పూర్తి చేసుకున్నారు. నాటి నుంచి నేటి వరకు సుమారు ఏడాదిన్నర కావొవస్తున్నప్పటికీ పాలకవర్గం నియామకంలో జాప్యం జరుగుతూ వచ్చింది. ఈసారి మార్కెట్ చైర్మన్ పదవి ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ కావడంతో మిర్యాలగూడ పట్టణం, దామరచర్ల, మాడుగులపల్లి, వేములపల్లి, మిర్యాలగూడ రూరల్ మండలాలకు చెందిన నాయకులు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు చైర్మన్ పదవి కోసం మాడుగులపల్లి మండలం నుంచి టీఆర్‌ఎస్ నాయకుడు అవిరెండ్ల నర్సయ్య, మిర్యాలగూడ మండలం నుంచి వెంకటాద్రిపాలెం మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు(వెంకన్న), మాజీ ఎంపీపీ జానయ్య, దామరచర్ల మండలం నుంచి బైరం నర్సయ్య, ఆశీర్వాదం, వేములపల్లి నుంచి ఇరుగు వెంకటయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పుట్టల భాస్కర్ ముమ్మర ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. గత పాలకవర్గంలో చైర్మన్ పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేసి విఫలమైన మిర్యాలగూడ మండలానికి చెందిన తుంగపహాడ్ మాజీ సర్పంచ్ చిలుకూరి సత్యనారాయణ వైస్ చైర్మన్ పదవి ఆశిస్తున్నట్లు సమాచారం. మాడుగులపల్లి, దామరచర్ల మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పాలకవర్గంలో పేర్లు సూచించే విషయంలో రెండు వర్గాలుగా ఏర్పడడంతో ఇన్నాళ్లు కమిటీ ఏర్పాటు జాప్యానికి కారణమని తెలియవచ్చింది.

బాటసారులకు పెరుగన్నం పంపిణీ



బాటసారులకు పెరుగన్నం పంపిణీ చేస్తున్న జనమైత్రి ఫౌండేషన్ సభ్యులు

మిర్యాలగూడ అర్బన్: జనమైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద బాటసారులకు పెరుగన్నం పంపిణీ చేశారు. ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడుతున్న ప్రజలకు తమ వంతుగా పెరుగన్నం అందజేస్తున్నామని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ మునీర్ అన్నారు. కార్యక్రమంలో హుస్సేన్, లింగరాజు, సంజీవరెడ్డి, రషీద్, లింగస్వామి, షాకీర్, కేశవులు, గోపి, సోను, ఉమర్ తదితరులున్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవాలు



పూజల్లో పాల్గొన్న నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

త్రిపురారం: మండలంలోని రాగడపలో గల కనకదుర్గమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలను ఆదివారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. నిడమనూరు మార్కెట్ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవూరి వెన్నెల, బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు మాధా ధనలక్ష్మీ, కలకొండ వెంకటేశ్వర్లు, వెంకన్న, పెద్దులు, బొల్లం వెంకటేశ్వర్లు, రేవూరి కోటయ్య, సైదయ్య, నల్లబోతు రాములు, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు పుల్లయ్య

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడి రైతులను నకిలీ విత్తనాలు అంటగడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం సీనియర్ నాయకుడు వేములకొండ పుల్లయ్య డిమాండ్ చేశారు. ఆదివారం తిరుమలగిరి మండలంలోని రాజవరం గ్రామంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత సంవత్సరం నకిలీ పత్తి విత్తనాల వల్ల 80శాతం మంది రైతులు పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు రావాల్సిన దిగుబడి రెండు, మూడు క్వింటాళ్లు కూడా రాలేదన్నారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకొని ప్రభుత్వం రైతులకు విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మేకల సైదులు, పిల్లి వెంకన్న, పిట్టల శంకరయ్య, బుర్రి మధు, మేకల చిన ఇద్దయ్య, వెంకటేశ్వర్లు, దుర్గయ్య, రైతులు తదితరులు ఉన్నారు.

మూసాఅలీఖాన్‌కు ప్రైడ్ ఆఫ్ తెలంగాణ పురస్కారం



మూసాఅలీఖాన్‌ను సన్మానిస్తున్న వేణుగోపాలచారి తదితరులు

మిర్యాలగూడ టౌన్: హైదరాబాద్‌లోని బొగ్గులకుంటలో గల తెలంగాణ సారస్వత పరిషత్‌లో శనివారం రాత్రి శిఖరం ఆర్ట్ థియేటర్స్ వారు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ప్రైడ్ ఆఫ్ తెలంగాణ పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి మిర్యాలగూడ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త, నటుడు మూసాఅలీఖాన్‌ను ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయనకు తెలంగాణ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్. వేణుగోపాలచారి, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, శిఖరం ఆర్ట్ థియేటర్స్ సెక్రటరీ గొల్ల కృష్ణ, టీవీ ప్రొడ్యూసర్ మహ్మద్ షరీఫ్, బలగం సినిమా ఫేం మైమ్ మధు ప్రైడ్ ఆఫ్ తెలంగాణ పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

శాలిగౌరారం: రాష్ట్రస్థాయి స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ పోటీలకు శాలిగౌరారం మండలం వల్లాల మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాగిణి ఆదివారం తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయురాలు సంధ్య పర్యవేక్షణలో విద్యార్థులు అబ్దుల్ హకీం, గుండా రక్షిత, ఎస్. అంబికా సాయి, డి. నికేష్‌ల ఇన్నోవేషన్ 'ఆటోమేటిక్ స్పీడ్ లిమిట్ ఆఫ్ వెహికిల్ డిపెండ్స్ ఆన్ రోడ్స్' రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 13000 ఇన్నోవేషన్‌లలో కేవలం 70 ఎంపిక చేశారన్నారు. అందులో జిల్లా నుంచి వల్లాల మోడల్ స్కూల్ విద్యార్థుల ఇన్నోవేషన్ ఎంపికయిందన్నారు.

ఘనంగా బొడ్రాయి మహోత్సవం

మర్రిగూడ: మండల పరిధిలోని యరగండ్లపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి బొడ్రాయి వద్ద నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాడం శాంతమ్మవెంకటయ్య, మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, ఎంపీటీసీ సభ్యురాలు దంటు జ్యోతీజగదీశ్వర్, బీజేపీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, జమ్ముల వెంకటేష్, చామకూరి అబ్బయ్య, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.